క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతనగర్‌లో పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెందుర్తి నూకాలమ్మ ఆలయ ప్రాంతం, యాత పేట, పాతూరులో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సమితి ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, వి.సురేష్, బి.పైడన్న, సన్యాసి, భవాని తదితరులు పాల్గొన్నారు.

వంగలిలో బోరు ఏర్పాటు



బోరు తవ్వుతున్న దృశ్యం

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన బోర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి ఆదేశాల మేరకు ఎంపీటీసీ గవర తులసి నిధులతో ఈ బోర్‌ను తవ్వారు. గ్రామంలోని జెట్టి అప్పారావు తదితరుల పశువుల పాకల వద్ద సుమారు 15 పశువుల పాకలకు ఈ బోర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు గవర రాజు, కోట్ని అమ్మతల్లి నాయుడు, యర్రా శ్రీనివాసరావు, పొట్నూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు భోజన వసతి



బాలలకు భోజనం ఏర్పాటు చేసిన జొన్నకూటి ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని అనాథ బాలల ఆశ్రమంలో చిన్నారులకు ఆదివారం డాక్టర్ జొన్నకూటి ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం, పండ్లు పంపిణీ చేశారు. మామిడి అనిల్‌కుమార్, రెడగన్ దంపతులు వీటిని అందజేశారు. కార్యక్రమంలో డీజే ఫౌండేషన్ ప్రతినిధులు జొన్నకూటి విజయ్‌కుమార్, తోట గోవిందరావు, రెహెల్‌కుమారి, జొన్నకూటి అవినాష్, సఫీ, రోషన్ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



చేపల మార్కెట్‌లో అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తిరుమలనగర్ వాసులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డసంచులు వాడాలంటూ నినాదాలు చేశారు. కాలువలు, రహదారులు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, పరిసరాల్లో మురుగు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడ్లపూడి చేపల మార్కెట్, ఇతర ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమలనగర్ సంక్షేమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఏయ్ బిడ్డా.. బీఆర్‌టీఎస్ మా అడ్డా!

బీఆర్‌టీఎస్ రహదారుల్లో పశువుల సంచారం ప్రమాదకరంగా మారుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా సంచరిస్తున్న పశువులతో వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తుతున్నారు. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి.



రోడ్డు మధ్యలో సంచరిస్తున్న పశువులు

- రోడ్లపై పశువులతో వాహనదారుల తిప్పలు
- బీఆర్‌టీఎస్‌లో ఇష్టారాజ్యంగా పశువుల సంచారం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాటి యజమానులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవరం జంక్షన్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో సంచరిస్తున్న పశువులు

సింహాచలం: బీఆర్‌టీఎస్ రోడ్లను ఆనుకుని ఉన్న పలు గ్రామాల్లోని ప్రజలు ఆవులు, గేదెల పెంపకం సాగిస్తున్నారు. వారిలో కొందరు వాటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో అవి పగలూరాత్రీ తేడా లేకుండా యథేచ్ఛగా రోడ్లపై సంచరిస్తున్నాయి. అవి ఎటు వెళ్తున్నాయో..? ఎలా వెళ్తున్నాయో..? కూడా వాటి యజమానులు పట్టించుకోవట్లేదు. **రోడ్లపై వాహనాలకు అడ్డంగా పడి తిరుగుతున్న సమయంలో వాహనదారులే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి.**

నిత్యం వాహనాల రద్దీ

వేపగుంట జంక్షన్ నుంచి పాత గోశాల జంక్షన్ వరకు, పాతగోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్లలో నిత్యం వాహనదారులు, పాదచారులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం ఇది మరింత ఎక్కువ. గోపాలపట్నం నుంచి, వేపగుంట నుంచి సింహాచలం మీదుగా వేలాది మంది నగరంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి సమయంలో రోడ్లపై పశుసంచారంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ బ్రేక్‌లు వేయక తప్పని స్థితి. పొరపాటున పశువును ఢీకొంటే.. ఆ పంచాయితీని వదిలించుకోవడానికి నానా యాతనలు పడాలి.

విద్యార్థులకు ఇబ్బందులు

బీఆర్‌టీఎస్ మార్గాల్లో రోడ్లని అనుకునే అప్పన్నపాలెం, అడవివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉన్నాయి. ఆయా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ మార్గాల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. చాలామంది నడిచే వెళ్తుంటారు. చిన్నారులను తల్లిదండ్రులు నడిపించే తీసుకెళ్తుంటారు. పశువుల సంచారం ఎక్కువగా ఉండటంతో ఏ సమయానికి ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అడ్డంగా వచ్చేసింది...



నేను వేపగుంట నుంచి సింహాచలం వైపు నా బైక్‌పై వెళ్తున్నాను. మా వాళ్లకు టీ తీసుకెళ్తున్నా. ఒక్కసారిగా గేదె అడ్డంగా వచ్చేసింది. బైక్‌పై నుంచి కింద పడిపోతానేమో అనుకున్నా. బ్యాలెన్స్ కాసుకోవడంతో ప్రమాదం తప్పింది. నా హ్యాండిల్ బార్‌కు ఉన్న టీ ప్యాక్ చిట్లి, నా మీదికే తుళ్లింది. బీఆర్‌టీఎస్ రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలి.

– పవన్, సింహాచలం

అధికారులు స్పందించాలి



బీఆర్‌టీఎస్ రోడ్లపై పశువుల సంచారానికి అడ్డుకట్ట వేయాలి. రోడ్లపై అవి యథేచ్ఛగా తిరుగుతూ చాలాసార్లు భయాందోళనకు గురిచేస్తున్నాయి. కనీసం వాటిని నియంత్రించేందుకు వాటి యజమానులు కూడా వాటి వెంట ఉండట్లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. పశువుల యజమానులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి.

– నగేష్, వేపగుంట

అదరవు.. బెదరవు

రోడ్లపై సంచారానికి బాగా అలవాటు పడటంతో.. ఎంతగా హారన్లు మోగిస్తున్నా.. పశువులు పక్కకు తప్పుకునే పరిస్థితి ఉండట్లేదు. వాటిని తప్పించుకుంటూ పక్కనుంచి నెమ్మదిగా వెళ్లాలన్నా.. ఏ క్షణం కొమ్ములతో కాస్త అదిలించినా.. అంతే సంగతులు. చాలాసార్లు కార్లకు వీటి కారణంగానే డెంట్లు పడుతున్నట్లు వాహన యజమానులు వాపోతున్నారు. ఒక్కోసారి రోడ్డు మధ్యలో పశువులు పడకేసి.. ఎంతకీ కదలట్లేదు. కొన్నిసార్లు అవేవో పరుగు పందెం పెట్టుకున్నట్లు రంకెలేస్తూ వస్తుంటే.. చూసే వాహనదారుల గుండెల్లో వాటి అడుగుల శబ్దం ధ్వనించి, బెంబేలెత్తే పరిస్థితి. రాత్రి వేళల్లో రోడ్లపై నిద్రపోతున్న పశువుల్ని దగ్గరగా చేరుకునే వరకూ గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.



పాత అడవివరం జంక్షన్ నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో పశువులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

ఘనంగా బండిమాంబ పండగ మహోత్సవం



బండిమాంబ సన్నిధిలో గండి రవికుమార్ దంపతులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామంలో కొలువైన బండిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, తులసి దంపతులు దర్శించుకుని, పూజలు చేశారు. వారితో పాటు గ్రామ ఉప సర్పంచ్ సిరపరపు వాసు, వార్డ్ సభ్యులు గురి నాగమణి, పార్టీ నాయకులు యడ్ల నాయుడు, దేముడు బాబు, గురి భరత్, తేజ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల

సింహాచలం: అడవివరంలోని నవ యువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మహా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. 220 మంది దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. నగరంలోని రోటరీ, వందేభారత్ బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులు వినోద్‌బాలు, అశోక్ సారథ్యంలో సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో 588 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి విష్ణు, 574 మార్కులు తెచ్చుకున్న కవితలను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్‌కుమార్, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. నవ యువ సేవా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముగిసిన గాయత్రి ఆలయ వార్షికోత్సవాలు

ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన





పూజలందుకున్న గాయత్రీమాత, పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్‌లో కొలువుదీరిన పంచముఖ గాయత్రీమాత ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణ చేశారు. కుంకుమ పూజలు జరిపారు. చండీయాగం అనంతరం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి చేశారు. లలిత పారాయణం, లక్ష్మీపారాయణ, ఆంజనేయ పారాయణ జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్న సమారాధనను కార్పొరేటర్లు శానాపతి వసంత శంకర్రావు దంపతులు, ముమ్మన దేముడు దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. దాదాపు 4 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని శ్రీకృష్ణ చైతన్య మిషన్ పీఠాధిపతి 108వ త్రిదండి స్వామి, బీఎస్ కేశవ్‌మహారాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వందలాదిగా భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



గోతులమయంగా మూల స్వయంభూవరం రోడ్డు

పరవాడ: మండలంలోని రోడ్లు మరమ్మతులకు గురై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతికి గోతుల్లేని రోడ్లని విపరీతంగా ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా కనీస చర్యలు తీసుకున్న పాపానపోలేదు. ఇందుకు నిదర్శనమే కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి. పదేళ్లుగా రోడ్డు మరమ్మతులకు నోచుకోక ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు, స్థానికులు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. రెండున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిలో రాళ్లు తేలిపోయి, మోకాలి లోతు గోతులతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళ రహదారిలో రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోందన్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో కటిక చీకటిలో రోడ్డు మీద ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపిస్తున్నారు. ఈ రోడ్లను త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాళాలు పగలగొట్టి.. బంగారు నగలు చోరీ

లంకెలపాలెంలో ఘటన.. ఆరున్నర తులాల అపహరణ



తెరిచి ఉన్న బీరువా తలుపులు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

పరవాడ: లంకెలపాలెం రామాలయం వీధికి చెందిన సూరిశెట్టి వెంకటలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ చోరీలో బీరువాలో భద్రపర్చిన ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు వెంకటలక్ష్మి ఆదివారం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

రామాలయం వీధిలో నివసిస్తున్న వెంకటలక్ష్మి తన పెద్ద కుమార్తెతో కలిసి శనివారం ఉదయం పెందుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం తన ఇంటి డోర్ తెరిచి ఉన్నట్లు పొరుగువాళ్లు అందించిన సమాచారం మేరకు ఇంటికి చేరుకుంది. మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి, బెడ్‌రూమ్‌లోని సెల్ఫ్‌లో దాచిన తాళాలను తీసి, బీరువా తెరిచి, లాకర్లోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. చోరీ కేసును అనుమానస్పద కేసుగా నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

ముళ్ల పొదలతో రోడ్డు.. శిథిలావస్థలో వంతెన



రహదారిలో మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న వంతెన



దలాయిపాలెం రోడ్డులో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి శివారు పోలిపల్లి కూడలి–కలపాక రహదారిలో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో రహదారి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిలో హిందూజా, ఎన్టీపీసీ, ఫార్మాసిటీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, రోజువారీ కూలీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పొడవునా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు కళ్లకు తగలడం వలన ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకటి పడితే రోడ్డు పక్కనున్న ముళ్ల కంచెలు వాహనచోదకులకు కనిపించడం లేదు. రహదారిలో వీధి దీపాలు లేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీంతోపాటు దలాయిపాలెం ఉప్పుటేరుపై నిర్మించిన వంతెన మరమ్మతుల కోసం ఎదురుచూస్తోంది. వంతెనపై ఇరువైపుల ఏర్పాటు చేసిన రెయిలింగ్ శిథిలావస్థకు చేరి ముక్కలుగా పడిపోతోంది. రహదారిలో తుప్పలను తొలగించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా గరుడ స్వామి విగ్రహ ప్రతిష్ట



గరుడ విగ్రహ ప్రతిష్టలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. హోమం జరిపించారు. మహాభిషేకం చేశారు. ఆపై సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. చేశారు. ఉదయం నుంచే స్థానిక భక్తులు పోటెత్తారు. స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. వెంకన్న సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మణికుమార్ ఆచార్యులు, హరికృష్ణ ఆచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు దొడ్డి రమణ, మంత్రి మంజుల, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే స్కూల్ బస్సులు!



రోడ్డుపై పార్కింగ్ చేసిన బస్సులు

విశాఖ విద్య: ప్రైవేటు స్కూల్ బస్సులను రహదారులపైనే పార్కింగ్ చేస్తున్నారు. కాలనీల వాసులు రాకపోకలు సాగించే రెడ్లపై బస్సులను రోజంతా నిలుపుతున్నారు. దీని వల్ల ఆ దారుల్లో భారీ వాహనాలు వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు అంటున్నారు. ప్రైవేటు స్కూళ్ల బస్సులను నిలిపేందుకు తగిన పార్కింగ్ ప్రదేశం ఉండాలనేది నిబంధన ఉంది. పాఠశాల నిర్వహణకు అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా పార్కింగ్ ప్రదేశం ఎక్కడ చూపించారనేది ధృవీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన మీదటనే గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. కానీ ఎన్‌ఏడీ ఏరియాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు ఎటువంటి పార్కింగ్ ప్రదేశం లేకున్నా ఎలా అనుమతులు ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తీరంలో సందర్శకుల సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: మండలంలోనితిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి బీచ్‌కు సందర్శకులు తరలివచ్చారు. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండటంతో తీరంలోని ఇసుక తిన్నెలపై క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులు తీరంలో తడి ఇసుకతో వివిధ ఆకృతులను నిర్మించుకుంటూ ఆనందంగా గడిపారు. సాయంత్రం వరకు కెరటాలతో సయ్యాటలాడుతూ, చీకట్లు చుట్టుముడుతున్న వేళ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.